# చికిత్స

కప్పగంతుల మల్లికార్జునరావు



మహాలక్ష్మి వొడ్డూ పొడుగూ మనిషి.

నల్లగా కాస్తంత మొరటుగా ఉంటుంది. అంచేత మొదటినుంచి ఆమె వయసుకన్నా పెద్దదిగానే కనిపించేది.

యివాళ ఆమెకు ముప్పై సంవత్సరాలంటే ఎవరూ నమ్మరు. పైగా నవ్వుతారు. నవ్వుతారని మహాలక్ష్మికి తెలుసు. అందుకే ఆమెకు యిరుగుపొరుగువారంటే మహా మంట.

అందరూ తన వయసును గురించి ఆమె చెప్పే సత్యాన్ని నమ్మకపోవటంతో, ఆమె కూడా తనకు ముప్పై ఏళ్ళన్న విషయాన్ని మర్చిపోయింది. ఇరవయ్యేళ్ళ పడుచులాగా కన్పించాలని ఆరాటపడుతుంది. అందుకు ఆమె చేసే అలంకరణ అంతా ఇంతా కాదు. అంత ఓపిగ్గా అలంకరణను ఎవరూ చేసుకోరు-చేసుకోలేరు.